దళారుల చేతికి ధాన్యం

- ఇంతవరకు తెరుచుకోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- రంగంలోకి దిగిన దళారులు
- తక్కువ ధరకే ధాన్యం సేకరణ
- నష్టపోతున్న రైతులు

బలిజిపేట:

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతులు కుదేలవుతున్నారు. పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తక్కువ ధరకు ధాన్యాన్ని దళారులకు విక్రయించాల్సిన పరిస్థితి. ప్రభుత్వం కొనుగోలు చేసే వరకు ధాన్యాన్ని భద్రపరిచేందుకు చోటు లేక తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకే విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా దళారులు రైతుల కళ్లాల వద్దకు వెళ్లి ధాన్యం సేకరణ వేగవంతం చేశారు. ఇప్పటికే సగం ధాన్యం ఇతర జిల్లాల్లోని మిల్లులకు తరలిపోయాయి. మిగిలిన వాటిలో ధర నిర్ధారించుకోలేక మిల్లర్లకు పంపేస్తున్నారు. ట్రక్‌షీటు కట్ అయిన తరువాత లెక్క చూసుకుంటామని రైతులు తెలుపుతున్నారు. రెండో పంట వేసుకోవాలనుకునే వారు త్వరగా నూర్పులు పూర్తిచేసి ధాన్యాన్ని వచ్చిన ధరకు విక్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలతో పనిలేకుండానే నేరుగా మిల్లులకు తరలిస్తున్నారు. అంతా వారే చూసుకుంటారనే ధోరణితో ఉన్నారు. ప్రభుత్వం క్వింటా సాధారణ రకం రూ.2,300 మద్దతు ధర నిర్ణయించగా దళారులు రైతుల వద్ద క్వింటా రూ.1,800లు చొప్పున సేకరిస్తున్నారు. 80 కిలోలు రూ.430 నుంచి రూ.480 మధ్య కొనుగోలు చేస్తున్నారు. తూకంలో 80 కిలోలకు అదనంగా 4 కిలోలు కలిపి 84 కిలోలు చొప్పున తీసుకుంటున్నారు. మిల్లుర్లు కూడా ఇదే విధంగా తీసుకుంటున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు అన్ని విధాలా నష్టపోతున్నారు.



చిలకలపల్లిలో మిల్లు వద్ద దించుతున్న ధాన్యం బస్తాలు, (ఇన్‌సెట్లో) లారీలకు ఎక్కిస్తున్న ధాన్యం

నష్టానికి విక్రయించాం

పంటకోత, నూర్పులు పూర్తిచేశాం. వచ్చిన ధాన్యం నిల్వ చేసేందుకు సరైన స్థలం లేదు. కళ్లంలోనే భద్రపరచాల్సిన పరిస్థితి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఇంతవరకు తెరవలేదు. వాతావరణ పరిస్థితులకు భయపడి తక్కువ ధరకే ధాన్యం వ్యాపారులకు పంట విక్రయించాల్సి వచ్చింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– పాపినాయుడు, రైతు, పి.చాకరాపల్లి గ్రామం, బలిజిపేట మండలం

క్లుప్తంగా

పెదపెంకిలో వైద్య సేవలు



రోగులకు ఆరోగ్య సేవలు అందిస్తున్న డాక్టర్ కిరణ్మయి, సిబ్బంది

బలిజిపేట: రోగులకు అవసరమైన సేవలు అందించాలని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి క్రాంతి కిరణ్మయి సూచించారు. పెదపెంకిలో సోమవారం ఎఫ్‌డీపీ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని హెల్త్ క్లినిక్‌లో ప్రజలకు వైద్యసేవలు అందించారు. హైపర్‌టెన్షన్, డయాబెటిస్, ఇతర వ్యాధులతో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గ్రామంలో పాత ఫైలేరియా కేసులను పరిశీలించి వారికి అవసరమైన డీఈసీ మాత్రలు పంపిణీ చేశారు. రోగులకు అన్ని వేళలా అవసరమైన వైద్యసేవలు అందించాలని సిబ్బందిని సూచించారు.

పంటలకు మద్దతు ధర ప్రకటించాలి

పార్వతీపురంటౌన్: రైతులు సాగుచేస్తున్న పంటలకు మద్దతు ధర చెల్లించాలని రైతు, కార్మిక సంఘాల సమన్వయ కన్వీనర్ బంటు దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్మిక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, విద్యుత్ సంస్కరణ చట్టాలను, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు పాత బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ, అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలంతా ఈ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి



ర్యాలీ చేస్తున్న గిరిజనులు

సీతంపేట: నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని సీపీఐ (ఎంఎల్) నాయకుడు భాస్కరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐటీడీఏ వద్ద ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏటా 10 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నారు. అన్ని రంగాల కార్మికులకు ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. వైద్యరంగం ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు



విద్యార్థుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుంటున్న వైద్యాధికారి శృతి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. రావాడ రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, వైద్యాధికారి ఎం.శృతి కలిసి ప్రతీ విద్యార్థి ఆరోగ్యం పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే మెరుగైన ఆరోగ్యానికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ ప్రత్యూష, ఏఎన్‌ఎంలు పద్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ రోగులకు రవాణా సౌకర్యం కల్పించాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న డయాలసిస్ రోగుల బంధువులు, ప్రజా సంఘాల నాయకులు

పార్వతీపురం: జిల్లాలోని కిడ్నీ వ్యాధి గ్రస్తులు డయాలసిస్ కేంద్రానికి వెళ్లేందుకు వీలుగా అంబులెన్స్‌లను పంపించాలని బాధిత కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో డుమా పీడీ కె.రామచంద్రరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మికసంఘం నాయకుడు రెడ్డి ఈశ్వరరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు, శ్రామిక మహిళా సంఘ నాయకురాలు వి.ఇందిర మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి డయాలసిస్‌కు వచ్చేవారికి రవాణా సౌకర్యాలు లేకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారన్నారు. నడవలేనివారు, లేవలేనివారు, కూర్చోలేనివారు ఎంతో మంది డయాలసిస్‌కు వస్తుంటారన్నారు. అటువంటి వారిని డయాలసిస్ కేంద్రాలకు తరలించేందుకు అంబులెన్స్ సేవలు నిలిపివేయడంతో వారంతా ఎన్నో వ్యయప్రయాసలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. వారి ఇబ్బందులను గుర్తించి వారికి రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఆరోగ్యశ్రీ మిషన్‌తో మాట్లాడి అవసరమైన చర్యలు చేపడతామని పీడీ తెలిపారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌కు పలు వినతులు



సీతానగరం: ఎంపీడీఓ త్రివిక్రమరావుకు వినతిపత్రం అందజేస్తున్న అర్జీదారు



పార్వతీపురంటౌన్: అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు



బలిజిపేట: పబ్లిక్ గ్రీవెన్స్‌లో పాల్గొన్న అధికారులు

పార్వతీపురంటౌన్: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసల్ సెల్) కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రూపేష్‌కుమార్, ఎస్సై సంతోషి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా నర్సిపురం గ్రామంలోని శ్మశానవాటిక ఆక్రమణలకు గురవుతోందని, అధికారులు స్పందించి సరిహద్దులు నిర్ణయించి ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ప్రజల నుంచి అందిన వినతులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్జీదారులకు హామీ ఇచ్చారు. ప్రతీ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యలపై వినతులు స్వీకరిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బలిజిపేట: మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఎంపీడీఓ విజయలక్ష్మి ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సీతానగరం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు 3 అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు తెలిపారు. రామవరం గ్రామానికి చెందిన రెడ్డి తవిటినాయుడు గతంలో ఉపాధిహామీ పథకం నిధులతో చేపట్టిన పనులకు ఇంతవరకు బిల్లులు అందలేదని, బక్కుపేటకు చెందిన గ్రీన్‌అంబాసిడర్ తనకు బాకీ ఉన్న వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ వినతులు అందజేసినట్లు చెప్పారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

నేడు దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం

పార్వతీపురం: దివ్యాంగులు, వయోవృద్ధుల సహాయ ఉపకరణాలు గుర్తింపు శిబిరం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం (అలీమ్‌కో) ద్వారా జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల ఉచిత సరఫరాకు అవసరమైన గుర్తింపు శిబిరాన్ని ఈ నెల 26న సాలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలనుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 80 శాతం కంటే ఎక్కువ వికలాంగత్వం కలిగి, చేతులు ధృఢంగా ఉన్న వారికి బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిల్, చేతులు ధృఢంగా ఉండి కాళ్లు బలహీనంగా నడవలేని వారికి, మూడు చక్రాల సైకిల్, పూర్తిగా కాళ్లు తెగిపోయిన వారికి కృత్రిమ అవయవాలు అందిస్తారని తెలిపారు. రెండు కాళ్లు, చేయి పూర్తిగా పని చేయని వారికి రెండు చక్రాల తోపుడు కుర్చీ (వీల్ చైర్), చంకకర్రలు, బలహీనమైన కాళ్లు ఉండి పట్టీల సహాయంతో నడవగలిగే వారికి కాలిపర్స్, కాళ్లు తెగిపోయిన వారికి కృత్రిమ అవయవాలు అందించనున్నట్లు తెలిపారు. అంధులకు స్మార్ట్ కేన్/చేతికర్ర, బ్రెయిలీ కిట్, స్మార్ట్‌ఫోన్స్, బధిరులకు శ్రవణ యంత్రం అందిస్తారని వివరించారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

- ఏపీ రైతు సంఘం డిమాండ్



తహసీల్దార్ అప్పారావుకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘాల నాయకులు, పత్తి రైతులు

భామిని: మండల వ్యాప్తంగా దాదాపు ఐదు వేల ఎకరాల్లో పత్తి పండిస్తున్న రైతులు దిగుబడిని విక్రయించుకోలేక ఇబ్బంది పడుతున్నారని ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. ఈమేరకు రైతు సంఘాల నాయకులు గురుబిల్లి వెంకట లక్ష్మీపతినాయుడు, కొత్తకోట బాబురావు నాయుడు, పత్తి రైతులతో కలసి సోమవారం స్థానిక తహసీల్దార్ అప్పారావును కలిశారు. మండలకేంద్రంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో దళారులు రైతులను మోసం చేస్తున్నారన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

మాత్రలతో రెక్కల పురుగు నిర్మూలన



రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సతీష్

బలిజిపేట: క్యాబేజీ, కాలీఫ్లవర్ పంటలను ఆశించే రెక్కల పురుగు నిర్మూలనకు అమిష్ క్రాప్ సైన్స్ నూతన, సాంకేతిక ఉత్పాదన అల్లు–డి మాత్రలపై డాక్టర్ సతీష్ రైతులకు అవగాహన కల్పించారు. మాత్రల వినియోగం, వాటివల్ల పొందే లాభాలను రైతులకు వివరించారు. క్యాబేజీ పంటలో టాబ్లెట్‌ను ఒక ఎకరములో 10 పాయింట్‌లో ఒక్కో పాయింట్‌లో ఒక ట్రేలో 1–2లీటర్ల నీటిలో ఒక టాబ్లెట్ వేసి ఉంచవలెను. ఈ విధంగా ట్రే పెట్టడం వల్ల అక్కడ ఆ టాబ్లెట్ విడుదల చేసిన వాసనకు తల్లిపురుగు అక్కడ నీటిపై చేరి ఎగరలేక చనిపోతుందని తెలిపారు. ఈ విధంగా మొదటి దశలోనే తల్లిపురుగును నిర్మూలించవచ్చని తెలిపారు. దీని వల్ల పిచికారీ ఖర్చు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు, అమిష్ క్రాప్ సైన్స్ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్యంపై అవగాహన



శిక్షణలో పాల్గొన్న ఆశ కార్యకర్తలతో వైద్యులు

సీతానగరం: ఆయుష్ వైద్య సేవలతో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చని బూర్జ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ టి.హేమాక్షి అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డాక్టర్ ఉష, డాక్టర్ పావని ఆధ్వర్యంలో ఆశావర్కర్లకు ఆయుష్ వైద్య సేవలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ.. ఆయుష్ వైద్య విధానం ద్వారా ఆరోగ్య సంరక్షణ, శారీరక, మానసిక వ్యాధులు, మధుమేహ నియంత్రణపై ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఆయుష్ శాఖ కమిషనర్ ఉత్తర్వులు మేరకు శిక్షణకు సంబంధించిన షెడ్యూల్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సమర్పించడం జరిగిందన్నారు. ప్రాచీన ఆయుర్వేద వైద్య విధానంతో అనేక దీర్ఘకాలిక వ్యాధులు, మానసిక వ్యాధులను నివారించవచ్చన్నారు. ఔషధ మొక్కల ఉపయో గాలు, గృహ వైద్య విధానంపై అవగాహన కల్పించారు. శిక్షణకు సంబంధించిన పుస్తకాలను, బ్రోచర్లను అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆయుష్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది



ట్రక్ షీట్ ఇచ్చిన ధాన్యాన్ని మిల్లుకు పంపిస్తున్న ఎమ్మెల్యే బి విజయ్‌చంద్ర

- ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర
- పెదభోగిలిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సీతానగరం: రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతులు తాము పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా అమ్మకాలు చేపట్టి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అన్నారు. మండలంలోని పెదభోగిలి రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు శ్రేయస్సు కోసం ఎన్‌డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు దళారుల బారినపడి మోసపోవద్దని కోరారు. రైతులకు ఉచితంగా గోనె సంచులు సరఫరా చేయడంతో పాటు హమాలీ చార్జీలు, రవాణా చార్జీలను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. నిబంధనల మేరకు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేస్తున్నట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు. గ్రేడ్–ఎ రకం ధాన్యం క్వింటాకు రూ.2320, సాధారణ రకం క్వింటాకు రూ.2300 చొప్పున మద్దతు ధర చెల్లించనున్నట్లు చెప్పారు. 40 కేజీల బస్తాకు రూ.920లు, 80 కేజీల బస్తాకు రూ.1840లు చెల్లించడం జరుగుతుందన్నారు. రైతులే గోనె సంచులు, హమాలీ, రవాణా ఖర్చులు పెట్టుకుంటే ఆ మొత్తాన్ని ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం కిరణ్‌కుమార్, తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, ఎంపీడీఓ త్రివిక్రమరావు, మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు సత్యంనాయుడు, వేణుగోపాల్, వెలుగు, ఉపాధిహామీ పథకం, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న దాడులు అడ్డుకోవాలి

- ఐద్వా నాయకురాలు వి.ఇందిర



పార్వతీపురం టౌన్: మాట్లాడుతున్న ఐద్వా నాయకులు వి.ఇందిర

పార్వతీపురంటౌన్: మహిళలపై జరుగుతున్న దాడులు ఆపాలని ఐద్వా నాయకురాలు వి.ఇందిర అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఎస్‌ఎఫ్‌ఐ మహిళా సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ హింస వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీపురం రూరల్ ఎస్‌ఐ సంతోషి మాట్లాడుతూ.. ఈ కాలంలో మహిళలు చాలా జాగ్రత్తగా ఉండాలని, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు కంగారు పడకుండా సమస్యను ఎలా ఎదుర్కోవాలి అని ఆలోచన చేయాలన్నారు. ఐద్వా నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మహిళలకు రక్షణ కరువైందని, మహిళలపై చిన్నచూపు నేటికీ కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్భయ, దిశ వంటి చట్టాలు ఎన్ని వస్తున్నా మహిళలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. పురుషులతో సమానంగా స్త్రీలు అన్ని రంగాల్లో రాణించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కె.రాజు, పార్వతీపురం టౌన్ కార్యదర్శి కె.డేవిడ్, జిల్లా కమిటీ సభ్యుడు ఎం.శివ, టౌన్ కమిటీ సభ్యుడు సాయి, హాస్టల్ వార్డెన్ పూర్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ

పవిత్ర కార్తీకమాసం నాలుగో సోమవారం సందర్భంగా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. వేకువజామున భక్తులు కోనేటిలో స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం సమీపంలోని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పార్వతీపురంటౌన్: పట్టణంలోని ఉమా మార్కండేయ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సీతానగరం: చెల్లన్నాయుడువలస కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో పూజలు



బలిజిపేట: గలావల్లి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పార్వతీపురం: వెంకంపేటలో శివలింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

లింగ సమానత్వం సాధించాలి



బలిజిపేటలో ర్యాలీ చేస్తున్న అధికారులు, మహిళలు

బలిజిపేట: స్త్రీ, పురుషులు సమానులే, స్త్రీలకు పురుషులతో సమాన గౌరవం అందేవిధంగా చూడాలని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. 'నయి చేతన–3.0' కార్యక్రమాన్ని ఏపీఎం ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సమాజంలో స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం తీసుకురావాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండల, గ్రామస్థాయిలో 30 రోజుల పాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. సాధికారత సాధించాలని, అణచివేత కాదని, ప్రేక్షకుడిగా ఉండకండి, లింగ ఆధారిత హింస నుంచి బయటపడిన వారి కోసం మాట్లాడాలని, నిశ్శబ్దాన్ని విచ్ఛిన్నం చేయాలని, హింసను అంతం చేయాలంటూ.. నినాదాలు చేశారు. ప్రతీ ఒక్కరూ భయం లేకుండా జీవించడానికి అర్హులని, ఒక స్త్రీ తన హక్కుల కోసం మాట్లాడినప్పుడు, హింస నుంచి బయట పడినప్పుడు బాధితురాలిగా చూడకుండా ఆమెను గౌరవించాలన్నారు. లింగ ఆధారిత హింస కేవలం మహిళల సమస్య మాత్రమే కాదని, అది మనందరినీ ప్రభావితం చేసే మానవ హక్కుల సమస్యగా పరిగణించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఎ.రవికుమార్, సీడీపీఓ సులేఖ, పలువురు అధికారులు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



సీతానగరం: ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

మహిళలు చైతన్యవంతులు కావాలి

సీతానగరం: మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులు, గృహ హింస, అత్యాచారాల నిర్మూలనకు ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీడీఓ త్రివిక్రమరావు అన్నారు. జెండర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని మార్కెట్‌లో సోమవారం వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు ఆధ్వర్యంలో మహిళా చైతన్య ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై మహిళలు చైతన్యవంతులు కావాలని కోరారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు, పొదుపు సంఘాల సభ్యులు, సీసీలు పాల్గొన్నారు.